# 12

# తప్పిపోయిన రాజు

## ఇశ్రాయేలు రాజైన అహజ్యా

## (1 రాజులు 22:40, 49-53; 2 రాజులు 1)

ఇశ్రాయేలు రాజైన అహజ్యా[1] పూర్తిగా తప్పిపోయిన వాడు. అతడు ఒమ్రీ[2] మనుమడు. అహాబు కుమారుడు, ఇద్దరూ - చారిత్రక దృక్పథంనుండి చూస్తే - విజయవంతమైన రాజులు. అహజ్యా వారివలె కాక ప్రతి విషయములోను తప్పిపోయినవాడు.

### అతడు వ్యాపార ప్రయత్నంలో తప్పిపోయాడు

అహజ్యా, తన తండ్రియైన అహాబు మరణమైన తరువాత (1 రాజులు 22:40) రాజయ్యాడు, అహజ్యా యూదా రాజైన యెహోషాపాతుతో వ్యాపార సంబంధములో అడుగుపెట్టాడు. వారు ఓడలు నిర్మించి తర్షీషుతో లాభసాటియైన వ్యాపారం (2 దినవృత్తాంతములు 20:35) చేయాలని సంకల్పించారు; అయితే వారి ప్రయత్నం దేవుని సంతోషపెట్టనందున, ఆ ఓడలు "ఎసోన్గెబెరు దగ్గర బ్రద్దలైనవి" (1 రాజులు 22:48). మరొక ఓడ వ్యాపారంలో తనతో భాగస్వామి కావాలని అహజ్యా యెహోషాపాతును అడుగగా "యెహోషాపాతు తిరస్కరించినందున," దానిలో కూడ భంగపడ్డాడు (1 రాజులు 22:49).

### అతడు సైనిక యుద్ధాలలో తప్పిపోయాడు

తన పితరులు సంపాదించిన భూభాగమును కాపాడుకొనుటలో తప్పిపోయాడు, "మోయాబీయులు ఇశ్రాయేలు వారి మీద తిరుగబడిరి" (2 రాజులు 1:1). తన శత్రువులు కూడ తను బలహీనమైన రాజని గుర్తించినట్లు స్పష్టమవుతంది.

### అతని ఆరోగ్యం క్షీణించింది.

అనుమానం లేకుండా అతడు దీర్ఘకాలం జీవించాలని కోరుకొని ఉంటాడు అయితే, ఆ విషయంలో కూడ అతడు విజయం సాధించలేక పోయాడు. రెండవ రాజులు గ్రంథకర్త ఇలా వ్రాశాడు, "అహజ్యా షోమ్రోనులోనున్న తన మేడమీది కిటికీలో నుండి క్రింద పడి రోగియై ..." (2 రాజులు 1:2). అతడొక విధమైన గాయం నొందటం వలన అతడు గదులలోని పరిస్థితులలో ఉన్నట్లు స్పష్టమవుతుంది (KJV; NIV చూడు).

అహజ్యా, "ఎక్రోను దేవతయగు బెయెల్జెబూబు నొద్దకు పోయి ఈ వ్యాధి పోగొట్టుకొని నేను స్వస్థపడుదునో లేదో విచారించుడని దూతలను పంపగా" (2 రాజులు 1:2). "యెహోవా దూత," యొక్క ఆజ్ఞ ప్రకారము ఏలీయా, అహజ్యాకు ఈ సందేశాన్ని పంపించాడు:

> "... ఇశ్రాయేలీయులలో దేవుడన్నవాడు లేడనుకొని ఎక్రోను దేవదూతయైన బయెల్జెబూబు

> నొద్ద మీరు విచారింపబోవుచున్నారా? కాగా యెహోవా సెలవిచ్చుచునదేమనగా, – నీవెక్కిన మంచము మీద నుండి దిగిరాకుండ నీవు నిశ్చయముగా మరణమవుదువు అని ఏలీయా వారితో చెప్పి వెళ్లిపోయెను” (2 రాజులు 1:3, 4; 1:6 కూడ చూడుము).

అహజ్యా అనారోగ్యంపాలైనప్పుడు, దేవుని సహాయం కోరుకొనుటకు బదులు, అబద్ధ దేవుళ్ళ యొద్ద విచారించుటకు సేవకులను పంపి, దేవుని నుండి చాలా దూరం తిరిగి పోయాడు!

### దేవుని ప్రవక్తను నెమ్మది పరచు తన ప్రయత్నంలో తప్పిపోయాడు

సందేశం ఏలీయా నుండి వచ్చిందని అహజ్యా విన్నప్పుడు, అతడు కోపపడి ప్రవక్తను పట్టుకొని బహుశా కీడు కలిగించుటకు ప్రయత్నించాడు; సఫలం కాలేదు. అతడు ఏలీయాను తీసుకొని వచ్చుటకు 50 మంది సైనికులను పంపినప్పుడు, వారిని పరలోకమునుండి దిగివచ్చిన అగ్ని దహించి వేసింది; అతడు మరొక 50 మందిని పంపినప్పుడు అదే ఫలితం వచ్చింది (2 రాజులు 1:9–12). మూడవ సారి 50 మందిని పంపినప్పుడు, ఆ 50 మంది యొక్క అధికారి ఏలీయాను బ్రతిమిలాడినప్పుడు, ఏలీయా వారితో రాజునొద్దకు వెళ్లుటకు ఇష్టపడ్డాడు (1:13–15). ఏలీయాను రప్పించుటలో అహజ్యా కృతకృత్యుడు అయినప్పటికి, అతడు ప్రవక్త యొద్ద నుండి ఎలాంటి మంచి సమాచారమును పొందలేక పోయాడు. అహజ్యా తప్పక మరణిస్తాడనే తన మొదటి సమాచారాన్నే ఏలీయా తిరిగి చెప్పాడు (1:16). “కాబట్టి అహజ్యా మరణించాడు” (1:17) – ఒక మనిషిగా, రాజుగా అహజ్యా ఘోరమైన భంగపాటుకు గురయ్యాడు.

### సంగ్రహము

అహజ్యా, ఆత్మీయముగా తప్పిపోవటం అతి ప్రాముఖ్యమైన సంగతి. అతడు విగ్రహాన్ని ఆరాధించుట ద్వారా దేవుని నిరుత్సాహపరిచాడు. కొన్ని బాధాకరమైన మాటలలో అతని పరిపాలన సంక్షిప్తం చేయబడింది:

> అహాబు కుమారుడైన యూదా రాజైన యెహోషాపాతు ఏలుబడిలో పదునేడవ సంవత్సరమందు షోమ్రోనులో ఇశ్రాయేలును ఏలనారంభించి రెండు సంవత్సరములు ఇశ్రాయేలును ఏలెను. అతడు యెహోవా దృష్టికి చెడుతనము జరిగించి, తన తలిదండ్రులిద్దరి ప్రవర్తనను,[3] ఇశ్రాయేలు వారు పాపము చేయుటకు కారకుడైన నెబాతు కుమారుడగు యరొబాము ప్రవర్తనను అనుసరించి ప్రవర్తించుచు వచ్చెను అతడు బయలు దేవతను పూజించుచు, వానికి నమస్కారము చేయుచు, తన తండ్రి చేసిన క్రియలన్నిటి చొప్పున జరిగించుచు, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు కోపము పుట్టించెను (1 రాజులు 22:51–53).

అతడు ఇతర మార్గములన్నిటిలో జయమొందినప్పటికి, దేవునికి విధేయత చూపుటలో తప్పిపోవుట వలన అతని విజయాలు అతనిని విలువలేని వానిగా చేసాయి.

## మన కొరకు పాఠాలు

*మనం తరచుగా తప్పిపోయాము.* ఒకవేళ మనం అహజ్యాను విమర్శించుటలో హెచ్చరికగా ఉండాలి. ఎందుకంటే, వ్యాపారంలోనో, ద్రవ్యం విషయంలోనో, పనిలోనో, ఆటలలోనో, లేక వ్యక్తిగత సంబంధాలలోనో మనమందరం కొన్నిసార్లు తప్పిపోతాము. మనందరికి కొట్టబడుతున్న కలల అనుభవం తెలుసు లేక తెలుస్తుంది. మనం తప్పిపోయినప్పుడు ఏమి చేయాలి? మరల ప్రయత్నించు! మరల ప్రయత్నించుటలో తప్పిపోవటమే నిజమైన తప్పిపోవటం. క్రైస్తవులముగా, మన తప్పిదాలను దేవుడు దైవవశాత్తు ఏదో ఒక మంచికి త్రిప్పుతాడని గుర్తించుకోవాలి (2 కొరింథీయులకు 12:9, 10; రోమీయులకు 8:28).

*మనకు దేవుని సహాయం అవసరం.* కష్ట సమయాలలో మనం దేవుని సహాయం కొరకు ఎదురు చూడాలని, అహజ్యా జీవితాన్ని బట్టి మనం గుర్తించుకోవాలి.

*ఆత్మసంబంధమైన తప్పిదాలను మనం తప్పించుకోవాలి.* దేవుని చిత్తాన్ని నెరవేర్చుటలో తప్పిపోయినందుకు మనం ఏ సాకు చూపలేము! మారుమనస్సు పొందుట ద్వారా తప్ప, పాపము నుండి తప్పించుకొనే వేరే మార్గం లేదు. జీవితంలో అన్ని విషయాలలో మనం విజయం పొంది, దేవుని సంతోషపెట్టుటలో తప్పిపోయినట్లయితే, మనం చిట్టచివరి తప్పిదానికి చేరినట్లు. కాబట్టి మన జీవితాలను మనం గమనించునట్లు గుర్తించుకొన వలసిన అవసరం ఉంది. దీనికి వ్యతిరేకంగా, మనమన్ని విషయాలలో తప్పిపోయి, దేవుని సంతోషపట్టుటలో జయమొందినట్లయితే, మనం జీవితంలో నిజంగా విజయం పొందినట్లే.

---

సూచనలు

[1]మరొక అహజ్యా యూదా రాజు. [2]అహజ్యా సుమారు క్రీ.పూ. 853–852 మధ్య పరిపాలించిన ఇశ్రాయేలీయుల ఎనిమిదవ రాజు. [3]ఒకడు "తల్లి మార్గములో నడిచెను" అను వాక్యము లేఖనాలలో ఈ ఒక్క చోట మాత్రమే కనిపిస్తుంది. ఈ వాక్యము యెజెబెలు సంతతి మీద మరియు ఇశ్రాయేలీయులందరి మీద శక్తి వంతమైన ప్రభావాన్ని చూపించినట్లు సాక్ష్యమిస్తుంది.